శిథిలావస్థలో కాజ్‌వేలు

- ఆధునికీకరించాలని ఆయా గ్రామాల ప్రజల డిమాండ్
- పట్టించుకోని ప్రభుత్వ శాఖలు



సావరగూడెం రోడ్డులో శిథిలావస్థకు చేరిన కాజ్‌వే

గన్నవరం రూరల్: మండలంలోని కాజ్‌వేలు అధ్వాన దుస్థితిలో ఉన్నాయి. దశాబ్దాల క్రితం వీటిని నిర్మించారు. అయితే తర్వాత కాలంలో వీటిని ఆధునికీకరించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. రహదారులపై ఉన్న కాజ్‌వేలను కొత్తగా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఎంతో కాలంగా కోరుతున్నారు. అయితే వీరి మొర ఆలకించేవారే లేరు.

రాకపోకలకు అంతరాయం

కేసరపల్లి నుంచి సావరగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో చీమలవాగు దాటిన తర్వాత కాజ్‌వే ఉంది. వర్షాలు కురిసిన సమయంలో ఈ కాజ్‌వే పైకి నీరు వచ్చి చేరుతుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అదేవిధంగా ముస్తాబాద, సూరంపల్లి రోడ్డు మార్గంలో లంబాడ బాట వాగుపై కాజ్‌వే ఉంది. ముస్తాబాద పెద చెరువు కళింగ పొంగినప్పుడు నీరు వాగులోకి ప్రవహిస్తుంది. వరదలు వచ్చినప్పుడు కాజ్‌వే పైన నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. సూరంపల్లి, రామచంద్రాపురం గ్రామాల మధ్య పోలవరం అండర్ పాసేజ్ ద్వారా నీరు వెంచర్ల వద్ద కాజ్‌వే దాటి ముస్తాబాద పేద చెరువులోకి వెళుతుంది. వర్షాలు అధికంగా కురిస్తే ఇక్కడ రహదారిపై ఉన్న కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

సాగునీరు అందించే మార్గాల్లో..

సావరగూడెం వద్ద ఉన్న కాజ్‌వేకు కొత్తగూడెం వద్ద నుంచి చీమలవాగు నీరు ప్రవహిస్తూ చిక్కవరం, బీబీగూడెం, పురుషోత్తపట్నం దాటి ఇక్కడకు వస్తుంది. ఈ కాజ్‌వే దాటి గూడవల్లి వద్ద బుడమేరులోనికి చేరుతుంది. ముస్తాబాద లంబాడ బాట వాగుకు వచ్చే నీరు పక్కనే ఉన్న పెద చెరువు నీరు పేద చెరువుకు చేరుతుంది. రామచంద్రాపురం వద్ద కాజ్‌వే పైకి వచ్చే నీరు మాదలవారిగూడెం నుంచి వచ్చి పోలవరం అండర్‌పాసేజ్ దాటి ఈ వాగులోకి ప్రవహిస్తుంది. ఇలా నిరంతరం నీరు ప్రవహించి రైతుల పంట భూములను సస్యశ్యామలం చేసే ఈ కాజ్‌వే లు ఆధునికీకరించాలని రైతాంగం కోరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

ఈ కాజ్‌వేలపై ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి వీటి ఎత్తు పెంచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నిర్మించాలని రైతాంగం కోరుతున్నారు. అనేక సార్లు ఈ రహదారి మార్గాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించినా, కాజ్‌వేలపై దృష్టి పెట్టలేదని రైతాంగం ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ శాఖను సమన్వయం చేసుకుని కాజ్‌వేలను నిర్మించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ముస్తాబాద లంబాడ బాటపై ఉన్న కాజ్‌వే



ముస్తాబాద వద్ద పూడుకుపోయిన లంబాడబాట వాగు

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం



ఎన్నో సంవత్సరాల క్రితం కాజ్‌వేలు నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరాయి. వాటిని కొత్తగా నిర్మించి రైతులకు మేలు చేయాలి. ప్రతి సంవత్సరం ఇవి నీట మునిగి రాకపోకలు నిలిపివేస్తున్నారు. దీంతో ఆయా గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని కాజ్‌వేలు కొత్తగా నిర్మించాలి.

– రామినేని రవిబాబు, రైతు, సావరగూడెం

ఎత్తు పెంచి నిర్మించాలి



కాజ్‌వేల ఆధునికీకరణ రైతులకు మేలు చేస్తుంది. ఇప్పటి వరకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే ఇవి దశాబ్దాల క్రితం నిర్మించినవి. ముస్తాబాద లంబాడ బాట వాగుపై గతంలో తండ్రి, కూతురు కొట్టుకుపోయారు. వీటిని ఎత్తు పెంచి నిర్మించాలి. అప్పుడు రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

– పసుమర్తి శ్యామ నాగేశ్వరరావు, రైతు, సావరగూడెం

కార్గో డోర్ డెలివరీపై అవగాహన



మాసోత్సవంలో మాట్లాడుతున్న డీఎం శివాజీ

గన్నవరం: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గన్నవరం డిపో మేనేజర్ పి. శివాజీ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా 80 పట్టణాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బస్‌స్టేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలోని ప్రదేశాలు కూడా పార్శిళ్లు, కొరియర్ కవర్లు ఇంటి వద్దకే డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. గన్నవరం, హనుమాన్‌జంక్షన్ బస్ స్టేషన్లలో కార్గో డోర్ డెలివరీ బుక్ చేసుకునే సదుపాయం ఉన్నట్లు పేర్కొన్నారు. డోర్ డెలివరీ పార్శిల్స్ బరువు, దూరానికి అనుగుణంగా ఛార్జీలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. కార్గో సేవలు పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు జనవరి 19 వరకు మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక బాపులపాడు, అప్పనవీడు జెడ్పీ హైస్కూళ్లలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, పుష్పావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రామానుజన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని పేర్కొన్నారు. గణిత శాస్త్రంపై మక్కువ, ఆసక్తిని పెంచుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలిపారు. విశ్వంలోని ప్రతి అంశం గణితంతో ముడిపడి ఉందని చెప్పారు. గణిత అభ్యాసన ద్వారా తార్కిక ఆలోచన, సమస్య పరిష్కారం, విమర్శనాత్మకత వంటి నైపుణ్యాలు పెంపొందుతాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి దారపురెడ్డి భాస్కరరావు, గణిత ఉపాధ్యాయులు విజయసారథి, ఎస్ బాబీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గన్నవరం రూరల్: వారంతా 27ఏళ్ల క్రితం డిగ్రీ చదివారు. అందరూ వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. మండలంలోని సావరగూడెం సమీపంలోని మామిడితోటలో కలిసి సందడి చేశారు. వేములపల్లి కోదండ రామయ్య కళాశాలల్లో 1994–97 సంవత్సరంలో డిగ్రీ చదివిన వారందరు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు పేద విద్యార్థులకు సాయం చేయాలని నిర్ణయించారు.

జగనన్న స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు



ఉయ్యూరు సెంటరులో పేదలకు దుస్తులు అందజేస్తున్న దేవభక్తుని చక్రవర్తి, జి.ప్రణీత్‌కుమార్

కంకిపాడు: జగనన్న స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ నేతలు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. నియోజకవర్గంలోని పెనమలూరు, కానూరు, గంగూరు, ఉయ్యూరు ప్రధాన సెంటర్లలో అభిమాన నేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేకులు కట్ చేశారు. అనాథశ్రమాలు, వృద్ధాశ్రమాలను సందర్శించి నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవానీల బంధ ధారణ



కంకిపాడు: ఉప్పలూరు శివాలయంలో భవానీల బంధ ధారణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నాగేశ్వరరావు గురుభవాని భవానీలకు బంధాలు కట్టారు. బంధ ధారణ అనంతరం భవానీలు జై భవానీ అంటూ విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నే ధనయ్య, కొండవీటి శివయ్య, జంపాన రవి, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న కూటమి విభేదాలు

- నేతల విగ్రహాల సైజులపై పంథాలు
- రాత్రికి రాత్రే విగ్రహం ఏర్పాటు
- హైకోర్టులో కేసు
- తలపట్టుకుంటున్న టీడీపీ బడా నేత



గతంలో ఉన్న నేతల విగ్రహాలు

పెనమలూరు: యనమలకుదురులో కూటమిపార్టీల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. గత ఎన్నికల్లో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన టీడీపీ, జనసేన నాయకుల మధ్య నేతల విగ్రహాలపై ఆధిపత్య పోరు మొదలైంది. టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించినా జనసేన నేతలు రాత్రికి రాత్రే రంగా విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇప్పటికే కొండ వెనుక ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహాలపై వివాదం కొనసాగుతోంది. తాజాగా తాడిగడప డొంక రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలపై రచ్చ చెలరేగింది. వివరాల్లోకి వెళితే.. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతలు కలిసి పోటీ చేశారు. అయితే యనమలకుదురులో మాత్రం కొద్ది రోజులకే నేతల మధ్య విభేదాలు వచ్చాయి. తాడిగడప డొంకరోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా జనసేన నేతలు రంగా విగ్రహం ఏర్పాటు చేశారు. కొద్ది రోజులకే రంగా విగ్రహం పక్కనే టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహం పెట్టారు. అయితే ఎన్టీఆర్ విగ్రహం రంగా విగ్రహం కంటే ఎత్తుగా ఉండటంతో రంగా విగ్రహం సైజు కూడా పెంచాలని జనసేన నేతలు సన్నాహాలు చేపట్టారు. దీంతో రచ్చ మొదలైంది.

విగ్రహాల సైజు కోసం వివాదం..

ఎన్టీఆర్ విగ్రహం సైజులోనే రంగా విగ్రహం పెట్టాలని జనసేన నేతలు రంగంలోకి దిగారు. పాత రంగా విగ్రహం స్థానంలో సైజు పెద్దగా ఉండే మరో విగ్రహం ఏర్పాటుకు పనులు మొదలుపెట్టారు. అయితే ఎన్టీఆర్ విగ్రహం పక్కనే రంగా విగ్రహం పెట్టరాదని టీడీపీ శ్రేణులు ఆ పార్టీ బడా నేత వద్దకు పంచాయతీకి వెళ్లారు. కాగా ఆ నేత వివాదాన్ని ఎటూ తేల్చలేదు. దీంతో టీడీపీ నేతలు బడా నేతపై కినుక వహించారు. ఈ లోగా జనసేన నేతలు ఎన్టీఆర్ విగ్రహం సైజులో ఉండే మరో రంగా విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటంతో టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చిందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

స్పందించని అధికారులు..

కాగా కోర్టులో కేసు ఉండగానే జనసేన నేతలు రాత్రికి రాత్రే ఎన్టీఆర్ విగ్రహం పక్కనే పాత రంగా విగ్రహం తొలగించి, మరో విగ్రహం ఏర్పాటు చేశారు. టీడీపీ గ్రామ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. పోలీసులు ఘటనా స్థలం వద్దకు వచ్చి వెళ్లిపోయారు. మున్సిపాలిటీ అధికారులు సైతం స్పందించలేదు. దీంతో గ్రామ టీడీపీ నేతలు మండిపడుతున్నారు. టీడీపీ బడా నేత కూడా పార్టీకి మద్దతు ఇవ్వకపోతే ఎలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడా నేత వైఖరితో..

బడా నేత వైఖరితో టీడీపీలో లుకలుకలు మొదలయ్యాయి. ఇక ఎవరిదారి వారు చూసుకోవడమేనని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా కోర్టు ఉత్తర్వులు ఉన్నా విగ్రహం పెట్టడంపై కోర్టును ఆశ్రయించిన వ్యక్తి కోర్టు ధిక్కారం కేసు వేస్తానని తెలిపాడు.



కోర్టులో కేసు ఉండగా రాత్రికి రాత్రే మార్చిన రంగా విగ్రహం

జిల్లాస్థాయి అండర్-17 క్రికెట్ జట్టుకు నలంద విద్యార్థులు



కంకిపాడు: జిల్లాస్థాయి అండర్–17 క్రికెట్ జట్టుకు ఈడుపుగల్లు నలంద విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ప్రతిభ చాటిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన మచిలీపట్నంలోని నేషనల్ కాలేజ్‌లో నిర్వహించిన అండర్–17 క్రికెట్ జట్ల ఎంపికలో ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ విద్యార్థులు ఎల్.మోక్షిత, ఎం.జైశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టులో స్థానం సాధించారని తెలిపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీఈడీ డి.ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

సేవా సదనం నిర్మాణానికి భక్తుల విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సేవా సదనం నిర్మాణానికి ఇరువురు భక్తులు రూ. 1.50 లక్షలు విరాళం అందజేశారు. అమెరికాకు చెందిన చలసాని జితేంద్ర, ప్రశాంతి దంపతులు రూ. లక్ష, హైదరాబాద్‌కు చెందిన కాసన్నేని సత్యప్రసాద్, స్వాతి దంపతులు రూ. 50 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాల అనంతరం విరాళం చెక్కులను భక్తులు ఆలయ కమిటీకి అందజేసినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని తదితరులు పాల్గొన్నారు.

రెడ్ వలంటీర్స్ శ్రమదానం



గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం జగనన్న లేఅవుట్‌లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య రెడ్ వలంటీర్స్ శ్రమదానం చేశారు. లేఅవుట్‌లోని పిచ్చి మొక్కలు, కంచెను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రెడ్ వలంటీర్స్ కన్వీనర్ బ్రహ్మచారి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రతి ఆదివారం రెడ్ వలంటీర్స్ ఆధ్వర్యంలో డ్రెయినేజీలు, శ్మశానాలు, రహదారుల వెంట పిచ్చి మొక్కలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో కూడా కరోనాతో మృతి చెందిన వారి అంత్యక్రియలు కూడా చేశామన్నారు. శ్రమదానంలో మల్లంపల్లి ఆంజనేయులు, చిటికల రాజేశ్వరరావు, ఏసుదాసు, కోటయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, కళ్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేవీబీ కుమార్‌కు సత్కారం



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ కార్యదర్శి జేవీబీ కుమార్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడలో సమావేశం నిర్వహించారు. దీనిలో సీనియర్ సిటిజన్స్‌కు ఉత్తమ సేవలందించిన వారిని సత్కరించారు. గన్నవరం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న జేవీబీ కుమార్ ఈ ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్‌కు విశిష్ట సేవలు అందించినందుకు మెమెంటో, దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సత్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని జేవీబీ కుమార్ పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ



నున్న(విజయవాడరూరల్): చైల్డ్ విజన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నున్న గ్రామంలోని కార్యాలయంలో 80 మంది నిరుపేద విద్యార్థులకు దుస్తులు, షూ, చలికోట్లు, బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ట్రస్ట్ నిరుపేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వై.సురేష్, విజయ్ బాబు, డిలైట్ తదితరులు పాల్గొన్నారు.

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామం సీఎస్ఐ చర్చిలో ఆదివారం 100 మంది పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేశారు. చర్చి ఫాస్టర్ చిలువూరి జయరాజు, చిలువూరి సామ్రాజ్యం, చిలువూరి బాపూజీ, సూరేపల్లి రాణి పాల్గొన్నారు.

కంకిపాడులో ఉచిత వైద్య శిబిరం



కంకిపాడు: లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యాన పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందికి పరీక్షలు నిర్వహించగా, 45 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే యూనిటీ దంత వైద్య శాల ఆధ్వర్యంలో 200 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.శివరామకృష్ణ, ప్రతినిధులు మద్దుల గోవిందరావు, మద్దుల యుగందర్, చవట శంకర్‌రావు, పిళ్లా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గొడవర్రులో డిప్యూటీ సీఎం పర్యటన

కంకిపాడు: మండలంలోని గొడవర్రు గ్రామంలో సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారు. ఉదయం 10.40 గంటలకు గ్రామానికి చేరుకుని పల్లె పండుగ కార్యక్రమం కింద నిర్మించిన గొడవర్రు ప్రధాన రహదారి మార్గాన్ని పరిశీలించనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఆదివారం గ్రామాన్ని సందర్శించి రోడ్డు నమూనాలను సేకరించి పరిశీలించారు. ఏర్పాట్లను ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావనారాయణ, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

12న సంక్రాంతి ముగ్గుల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వచ్చే నెల 12వ తేదీ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మహిళా వాకర్స్‌తో పాటు గన్నవరం పరిసరా ప్రాంత మహిళలు, బాలికలు హాజరు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు అసోసియేషన్ కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు 8886106162, కోశాధికారి బొక్కినాల కోటేశ్వరరావు 9985764423 నెంబర్లకు ఫోన్ చేసి ఎంట్రీలు నమోదు చేసుకోవాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: చోడవరంలో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దండమూడి వెంకటరత్నం గ్రామంలోని గంగానమ్మ గుడి వద్ద ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన కె.దుర్గాప్రసాద్ అకారణంగా వెంకటరత్నంతో తగాదాపడి దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటరత్నం ముక్కు, పెదవులకు గాయాలు అవడంతో అతని కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్–1లో పసుపులేటి అమలేశ్వరి, భర్త సురేంద్రకుమార్‌తో కలిసి ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే భర్తకు గత సంవత్సర క్రితం ప్రమాదం జరగడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా ఈ నెల 11వ తేదీన సురేంద్రకుమార్ బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. మరల అతను తిరిగి ఇంటికి రాలేదు. భర్త కోసం అమలేశ్వరి వెతికినా అతని జాడ తెలియలేదు. దీంతో ఆమె తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

దాసాంజనేయస్వామి దేవస్థానానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని దాసాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి దాత రూ. 10 వేలు విరాళాన్ని అందజేశారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు మేడేపూడి రామ్మోహనరావు ఆదివారం ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

నేడు పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఉంగుటూరు: మండలంలోని ఉంగుటూరు, ఎలుకపాడు, పొణుకుమాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విమలకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్నవారు సదస్సులో అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.